# అనుబంధాలు

డా. చలసాని ఉషారాణి

ఇంటరు రెండవ సంవత్సరపు పరీక్షల చివరిరోజు విద్యార్థినులందరూ చాలా ఆనందంగా హాలు నుంచి బయటకు వచ్చారు. అప్పటికి ఒకనెల క్రితమే ఫేర్‌వెల్ ఫంక్షను జరుపుకోవడమూ, రెండేళ్ళ చదువు పూర్తి అయి వెళ్ళిపోతున్నందుకు బాధపడటమూ అయిపోయింది. ఇప్పుడు ఇంటికి వెళ్తున్నామన్న ఆనందం మాత్రం అందరి ముఖాలల్లో కనిపిస్తోంది. వీరి ఆనందంలో పాలుపంచుకోనిది నందిత మాత్రమే.

పట్టణానికి చాలా దూరంలో కట్టబడిన రెసిడెన్షియల్ కాలేజీతో నందిత అనుబంధం ఏడేళ్ళది. పదకొండేళ్ళ పిల్లగా నందిత ఆకాలేజీ కాంపౌండులోకి అడుగుపెట్టింది. ఆరవ క్లాసు నుండి ప్లస్ టూ వరకు ఉన్న ఆ రెసిడెన్షియల్ కాలేజీలో చేరడానికి చాలా వరకు ధనవంతుల పిల్లలే వస్తారు. పదేళ్ళుగా అక్కడ ఇంగ్లీషు లెక్చరరు కమ్ వార్డెన్‌గా పనిచేస్తున్న నాకు నందిత అంటే ప్రత్యేక అభిమానం.

సామాన్యంగా ఆరవ క్లాసులో చేరడానికి వచ్చిన పిల్లలు తల్లిదండ్రిని వదిలి ఉండటానికి చాలా మారాము చేస్తారు. మొదటి రెండు నెలల్లో కనీసం ఇరవైసార్లయినా తమ ఊరికి పంపమని ఏడుస్తూ వార్డెన్ అయిన నాదగ్గరకి వస్తారు. అలా ఎప్పుడూ రాని నందితని చూసి కొంచెం విస్మయం పడేదాన్ని. మరి కొన్ని రోజులు గడిచాక ఆ పిల్ల మిగిలిన పిల్లలవలె ధనవంతుల బిడ్డకాదని ఆమె ధరించే డ్రస్సుల బట్టి గ్రహించగలిగాను. నేను చిన్నక్లాసులకి వెళ్ళకపోయినా వార్డెన్‌గా నందిత ప్రోగ్రెస్ రిపోర్టు చూసి చాలా తెలివైన పిల్ల అని తెలుసుకోగలిగాను.

హాస్టలు రూల్సు ప్రకారం నెలలో మొదటి శనివారం మాత్రమే తల్లిదండ్రులు తమ పిల్లలని చూడటానికి అనుమతిస్తారు. అయినా ఏదో ఒక కారణం చూపించి పేరెంట్స్ పిల్లలని కలవడానికి

ఇతర రోజుల్లో కూడా రావడమూ, యాజమాన్యం వాళ్ళని విసుగుకోవడమూ కూడా జరుగుతుంటుంది. రెండు నెలలు గమనించిన తరువాత నందితని చూడటానికి ఎవరూ రాలేదన్న విషయాన్ని నోటీసు రాస్తున్నాననీ, మమ్మల్ని కూడా రాయమని అడ్రసు ఇచ్చాడు.

ఈ పరిణామానికి విస్తుపోయినా డ్యూటీ ప్రకారం నందిత తల్లికి రాసాను. తల్లి నుండి ఉత్తరం వచ్చింది. నందితని ఆమె తండ్రి వచ్చి



చేసాను. క్వార్టర్లీ పరీక్షలు అయిన తరువాత తమ తమ పిల్లల్ని ఫలానా తారీఖున వచ్చి తీసుకెళ్ళమని ఉత్తరాలు రాసాము. నందిత తండ్రి ఉత్తరం రాసాడు నందితని ఆమె తల్లి వచ్చి తీసుకెళ్తుందనీ, తాను ఆమెకి ఉత్తరం తీసుకెళ్తాడనీ తాను కూడా ఆయనకి ఉత్తరం రాస్తున్నాననీ, ఈసారి మాత్రం నా ఉత్సుకతని ఆపుకోలేక నందితని పిలిపించాను. గుమ్మం దగ్గర ఆగిపోయి ఫ్రాకు అంచులు మెలిపెడుతున్న నందితని ప్రేమగా లోపలికి

పిలిచి లాలనతో విషయం అడిగాను. ఆ అమ్మాయి చెప్పింది విని మారుతున్న విలువల గురించి మదనపడ్డాను.

నందిత తల్లి విమల, తండ్రి మాధవ. ఇద్దరి కాపురం నాలుగేళ్ళు సవ్యంగానే సాగింది. తరువాత రెండవ కాన్పుకని పుట్టింటికి వెళ్ళింది విమల. ఆ బిడ్డ పురిట్లోనే పోవడం, ఆమెకి బాగా సుస్తీ చేయడంతో ఐదు నెలలు అక్కడే గడిపి రేపు ఆరవ నెల వస్తుందనగా మాధవ దగ్గరికి వచ్చింది విమల. ఆయన దూరపు బంధువు, ఏ బాదరబంధీ లేని వితంతువూ అయిన దుర్గాంబని ఆయనికి వండి పెట్టడానికి కుదిర్చినందున విమల అన్నిరోజులూ పుట్టింట్లో ఉండగలిగింది. కానీ ఈలోగా దుర్గాంబ ఒక్కగానొక్క కూతురైన రాధ పసుపు కుంకుమ కోల్పోయి తల్లి దగ్గరకు రావడమూ, దుర్గాంబ తెలివిగా మాధవ, రాధకి వశమైయ్యేటట్లు చేయడమూ జరిగిపోయింది. వచ్చిన కొద్ది రోజులకే విషయం గ్రహించి, మాధవిని నిలదీస్తే, 'వాళ్ళు ఇక్కడే ఉంటారు' అని ఖరాఖండిగా చెప్పడంతో అలిగి, ఉపవసించి, నీరసించి పోయింది విమల. ఇది సాకుగా తీసుకుని దుర్గాంబ విమలని రోగిష్టిదానిగా ప్రచారం చేసింది. వాళ్ళింటి ఎదురింట్లో మెడికల్ రెప్రజెంటేటివ్ అయిన రాజుని దుర్గాంబ మందుల సాంపిల్స్ అవీ అడుగుతుండేది.

విధి మనుషులతో ఆడే నాటకంలో భాగంగా విమలకై రాజు తన నలభైఏళ్ళ బ్రహ్మచర్యానికి మంగళం పాడేసాడు. ఇంట్లోనే సవతిని తెచ్చిపెట్టిన భర్త మీది ప్రతీకారంతో తన ఎనిమిదేళ్ళ కూతురుని వదిలి రాజుతో వెళ్ళిపోయింది విమల. వెళ్ళిన సంవత్సరం తరువాత విమల నందితకి ఉత్తరం రాసింది. వేసవి సెలవులలో తమ ఊరికి రమ్మనమనీ, ఒక బుల్లి తమ్ముడితో ఆడుకోవచ్చనీ దాని సారాంశం. మాధవికి రాధకి కూడా ఒక కూతురు పుట్టింది. కానీ దుర్గాంబ నందితని ఆ పసిపిల్ల దగ్గరికి రానీయదు. విమల రాసిన ఉత్తరం చూడగానే నందితని వదిలించుకుందామనే ఉద్దేశంతో మాధవని ఒప్పించి పాలేరుతో నందితని పంపించారు దుర్గాంబ, రాధ. తనతో ఎంతో ప్రేమగా ఉండే రాజు నందిత వచ్చిన దగ్గర నుంచీ చిరుబురు లాడటం గమనించిన విమల, తన మాతృప్రేమకి కళ్ళెం వేసి పదోరోజే నందితని తిరిగి మాధవ దగ్గరకు పంపేసింది. వదిలిందనుకున్న శని మళ్ళీ వచ్చేసరికి దుర్గాంబ, రాధ తమ విశ్వరూపం చూపారు.

ఎంతో తెలివైన, చురుకైన నందిత చాలా ఉదాసీనంగా మారడం గమనించిన ఎలిమెంటరీ స్కూలు హెడ్‌మాస్టరు, వాళ్ళ వీధిలోనివారు గావడంతో నందిత తల్లి తండ్రి దగ్గరకు పలుమార్లు తిరిగి నందితకి ఒక పరిష్కారం వెదికారు. విమలకి కట్నంగా ఇచ్చిన డబ్బుతో కొన్న రెండెకరాల పొలం నందిత పేరున రాసి, దానిమీద వచ్చే అయివేజుతో దగ్గరలోగల రెసిడెన్షియల్ స్కూలులో చేర్పించడమే ఆ పరిష్కారమార్గము.

ఈ కథ అంతా విని నందితని అక్కున చేర్చుకున్నాను.

''నేను నిన్ను దిగబెడతాను. ఎవరి దగ్గరకి వెళతావు?'' ఆప్యాయంగా అడిగాను.

''ఎవరి దగ్గరకీ వెళ్ళను'', బుల్లెట్‌లాగా దూసుకొచ్చింది సమాధానం. బుజ్జగించి కూడా ఆమె నిర్ణయం మార్చలేమని అనుకున్నాను.

''మరి?''

''స్కూలుకి కాపలాగా వెంకయ్య తాత ఇక్కడే ఉంటాడట కదా! ఆ తాతతో ఉంటా!''

''పోనీ, నాతో వస్తావా?''

''మీ ఇంట్లో ఎవరెవరుంటారు?'' అనుమానంగా అడిగింది నందిత.

''మా అన్నయ్య, వదిన, వాళ్ళ పిల్లలు, తమ్ముడు, మరదలు, వాళ్ళ పిల్లలు.''

''అయితే రాను.'' ఖచ్చితంగా అంది నందిత.

''పోనీ మనిద్దరం వేరే ఒక గది తీసుకుని ఉందామా?'' వెంటనే అడిగాను.

''ఓ'' కళ్ళు మెరుస్తుండగా నా మెడ చుట్టూ చేతులువేసి గట్టిగా ముద్దుపెట్టింది నందిత.

అంతకు ముందు నా మేనళ్ళుళ్ళు మేనకోడళ్ళు ఎన్నోసార్లు నాకు ముద్దుపెట్టారు కానీ నందిత పెట్టిన ఈ ముద్దు, నాలోని మాతృత్వాన్ని నిద్రలేపినట్లయింది.

అలా ఇద్దరమూ ఒక గూటి పక్షులమయ్యాము. పాతికేండ్లు వచ్చేదాకా పెళ్ళిమాట వద్దని చదువులోపడి, ఉద్యోగం వెతుక్కున్నాను. పాతికేండ్లు నిండిన తరువాత అన్నయ్య, తమ్ముడు అప్పటికే సంసారులై నా పెండ్లి సంగతి పట్టించుకోలేదు.

## హనీమూన్

''నేను హనీమూన్‌కు బొంబాయి, ఆగ్రా, ఢిల్లీ వెళ్ళి వచ్చాన్రా.'' చెప్పాడు సుబ్బారావు.

''అయితే అన్నీ చూసేశావన్నమాట.'' అన్నాడు అప్పారావ్.

''ప్చ్. ఏం చూడలేదురా, మా ఆవిడకు సిగ్గు ఎక్కువ.'' చెప్పాడు సుబ్బారావు.

- పి. రాధిక
(హంపసాగర)

నందిత రాక నా జీవితంలో ఒక వసంతం లాంటిదే. వార్డెన్ గిరికి రాజీనామా ఇచ్చి నేను, నందిత ఆరేళ్ళపాటు ఒకరికొకరిమై మెలిగాము.

ఇంటరు పూర్తి చేసిన నందిత ఎమ్‌సెట్‌కి ప్రిపేర్ అవుతుంది. గారంటీగా సీటు కూడా వస్తుంది. వేరే ఊరు, వేరే హాస్టలు వెతుక్కుంటుంది.

ఇపుడు నందితకి చాలా ఆత్మవిశ్వాసం వచ్చింది.

అప్పుడప్పుడూ తనని చూడటానికి వచ్చే తల్లీ తండ్రితో చాలా నిర్వికారంగా మాట్లాడేది. దాంతో వారు నందితపట్ల తమ అనుచిత ప్రవర్తన వలననే ఆమె ఆవిధంగా ఉంటున్నదని గ్రహించి మొహం చాటేశారు. ఆప్యాయతలకీ, అనురాగాలకీ నందిత సమాధి

కట్టేసింది.

''మేడమ్ గారూ! ఏమిటి అంతగా ఆలోచనల్లో పడ్డారు?'' చేతులు ఊపుతూ అడుగుతోంది నందిత.

''నీగురించేనమ్మా! మెడిసిన్ చదవడానికి ఏ ఊరు వెళ్తావోనని ఆలోచిస్తున్నా!''

''ఊహు- నేను సెకండరీ గ్రేడు టీచరు ట్రైనింగుకి అప్లయి చేస్తున్నా! అది అయిన తరువాత మరలా మీరూ, నేనూ...''

''వీల్లేదు.'' మధ్యలోనే అందుకున్నాను. ''నీ అంత తెలివైన పిల్ల ఇంత త్వరగా చదువుకి ఫులుస్టాపు పెట్టడం నేను సహించలేను.'' ఉద్వేగంగా అన్నాను. ''అయితే నామనవిని మీరు మన్నించాలి.'' వినయంగా అంది నందిత.

''ఏమిటది?'' అన్నట్లు ప్రశ్నార్థకంగా చూసాను.

''మీరు పెండ్లి చేసుకోవాలి.''

వినకూడని మాట విన్నట్లు ఉలికిపడ్డాను. ఇదే మాట అన్నయ్యగానీ, తమ్ముడుగానీ అని ఉంటే కులికేదాన్నేమో!

''నాకు ఇప్పుడు వయసు నలభై! తెలుసా నీకు? పరాచికాలు మానేయి!''

''మన గ్రామీణ బాంకు మానేజరు వయస్సు నలభై రెండు. అవివాహితుడు. ఒకప్పుడు ప్రేమలో భంగపడి వివాహానికి విముఖుడై ఇప్పుడు నాద్వారా మీగురించి విని సుముఖుడైనవాడు.'' తల వంచుకుని గడగడ చెపుతున్న నందితని చూస్తే ఆరవ క్లాసులో కంఠస్థం చేసిన పద్యాలు చేతులు కట్టుకుని నాకు అప్పచెప్పిన చిన్ని నందితే గుర్తుకు వచ్చింది. నందితకి వచ్చే కౌలు డబ్బులు బాంకులో వేయించింది నేనే. డబ్బు అవసరమైనపుడు తానే వెళ్ళి తెచ్చుకునేది. మానేజరుతో ఎప్పుడు ఈ చనువుని సంపాదించిందో నాకు అర్థం కాలేదు.

''చెప్పండి! సరేనని చెప్పండి. ప్రాధేయ పడుతూ అడుగుతోంది నందిత.

ఆప్యాయతలనీ అనురాగాలనీ సమాధి చేసిందనుకున్నాను కానీ వాటిని ప్రోగుచేసి పెట్టి నాకొక ప్రేమ మందిరం కట్టిపెడుతుందను కోలేదు. ఏడేళ్ళు ఆమెని నేను చేరదీసాను కానీ ఏడు జన్మల బంధాన్ని ఆమె నాకు ఇచ్చింది. అది కాలేజ్ కాంపస్ అని కూడా మర్చిపోయి చెమర్చిన కళ్ళు తుడుచుకుంటూ నందితని అక్కున చేర్చుకున్నాను.

★

